క్లుప్తంగా

28న వేద వర్సిటీ స్నాతకోత్సవం

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ నెల 28వ తేదీన మహతి ఆడిటోరియంలో శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ ఏడవ స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు ఆ వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ స్నాతకోత్సవానికి చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈఓ ఏవి.ధర్మారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొంది.

మిగిలింది ఐదు రోజులే..

తిరుపతి తుడా : 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుల చెల్లింపుల్లో 5 శాతం రాయితీ పొందేందుకు 30వ తేదీ వరకు అవకాశం ఉందని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి నగరంలో 68,913 అసెస్మెంట్లకు గాను రూ.65,92,72,936 కోట్లు వసూలు కావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ క్రమంలో ముందస్తు పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ ప్రకటించడంతో ఈ నెల 1 నుంచి 25వ తేదీ వరకు రూ.18,58,67,300 కోట్లు వసూలైనట్టు పేర్కొన్నారు. నగరవాసులు సకాలంలో పన్నులు చెల్లించి ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, రాజేష్

తిరుపతి కల్చరల్: సంస్కార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా టీడీటీ పరిపాలనా భవనం నుంచి కపిలతీర్థం వరకు శోభాయాత్ర చేపట్టారు. తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి వేద విద్యార్థుల మంత్రోచ్ఛరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్, సభ్యులు సతీష్, ప్రిన్సిపాల్ బ్రహ్మజీ శర్మ, పురోహిత్ సమాఖ్య, బ్రాహ్మణ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ మాడ వీధిలో..

శంకర జయంతి సందర్భంగా ఆర్ఎస్ మాడ వీధిలోని చిగోర ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో మంగళవారం జగద్గురు శంకరాచార్యులు, రామానుజాచార్యుల చిత్ర పటాలకు అభిషేకం, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ జీబీ సభ్యుడు సీఆర్కే.శేషగిరిరావు, విశ్వనాథం, జయలక్ష్మి, చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు, రవికుమార్ పాల్గొన్నారు.

పాఠశాల సోషల్ ఆడిట్‌లో తల్లిదండ్రులదే కీలక పాత్ర

రామచంద్రాపురం: పాఠశాల సోషల్ ఆడిట్‌లో తల్లిదండ్రులదే కీలక పాత్ర అని ఎంఈఓ వెంకటసుబ్బమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం పాఠశాల సోషల్ ఆడిట్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సమక్షంలో సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. మాస్టర్ ట్రైనర్ కుప్పయ్య సోషల్ ఆడిట్ నిర్వహించి యాప్‌లో ఎలా పొందుపరచాలో వివరించారు. నాడు-నేడు, జగనన్న గోరుముద్ద, పాఠశాల భద్రత, విద్యా ప్రమాణాల పెంపు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

సుబ్రమణ్యస్వామి విగ్రహ పనుల పరిశీలన



విగ్రహ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ పట్టాభిరెడ్డి

పాకాల : మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన 54 అడుగుల స్వామి విగ్రహ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మంగళవారం పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క అడుగు విగ్రహ నిర్మాణానికి రూ.51 వేలు ఖర్చు అవుతోందన్నారు. దాతల పేర్లు శిలాఫలకంలో ఏర్పాటుచేస్తామని తెలిపారు. విరాళాలు ఇచ్చే దాతలు నేరుగా ఆలయ కమిటీ చైర్మన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

జీతాల పెంపు కోసం ధర్నా

తిరుపతి అర్బన్: జీతాలు పెంచాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు జేఏసీ నేతృత్వంలో మంగళవారం తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఏపీ అమరావతి జేఏసీ, ఏపీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఉద్యోగులకు చాలీచాలని జీతాలు ఇస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి జీతాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పి.శ్రీకాంత్, పి.పద్మజారెడ్డి, పి.గోపినాథ్ రెడ్డి, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల తరహాలో గంగజాతర



యాగశాలలో హోమ గుండాన్ని వెలిగిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపు
- జాతర మహోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ
- భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపు



గంగజాతర ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునిక్రిష్ణయ్య

తిరుపతి కల్చరల్: దేశంలో మొట్టమొదటి గ్రామ దేవత ఆలయం, తిరుమల శ్రీవారి చెల్లెలిగా, భక్తుల కొంగు బంగారమై విరాజిల్లుతున్న తాతయ్యగుంట గంగమ్మ జాతరను బ్రహ్మోత్సవాల తరహాలో జరుపుకుందామని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం,మునిక్రిష్ణయ్యతో కలిసి జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో హోమ గుండాన్ని వెలిగించారు. ఆయన మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ ఆలయం సుమారు 1400 ఏళ్ల క్రితమే వెలసిందన్నారు. గంగమ్మను దర్శించుకున్న తర్వాతే తిరుమల శ్రీవారిని దర్శించాలన్న సంప్రదాయం 400 ఏళ్ల క్రితం వరకు కొనసాగిందన్నారు. 500 ఏళ్ల నుంచే ప్రతి జాతరకు తిరుమల శ్రీవారి నుంచి అమ్మవారికి సారె సమర్పించే సంప్రదాయం ఉందని పేర్కొన్నారు. అత్యంత విశిష్టత ఉన్న గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించాలనే భక్తుల ఆకాంక్ష మేరకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా ప్రకటించారని వివరించారు. తిరుపతిలో నివసిస్తున్న నాలుగున్నర లక్షల మంది ఈ భక్తి ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జాతరపై విస్తృత ప్రచారం చేస్తున్నామని, మరో 50 వేలకుపైగా పోస్టర్లతో ఆహ్వానం కలుకుతూ తిరుపతితో పాటు సమీప ప్రాంతాల్లో ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, వైఎస్ఆర్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చంద్రారెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆసరా



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- ఓటుతో జగనన్న రుణం తీర్చుకుంటాం
- గడప గడప కార్యక్రమంలో ఎంఆర్‌పల్లి ప్రజలు

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు మాకు ఆసరాగా నిలుస్తున్నాయని ఎంఆర్‌పల్లి వాసులు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతో జగనన్న రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మంగళవారం కార్పొరేటర్ ఈశ్వరి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు పడమటి కుమార్‌తో కలిసి తిరుపతి 21వ డివిజన్‌లోని ఎంఆర్‌పల్లిలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, వారు పొందిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ గతంలో పథకాల కోసం అధికారులు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అర్హత ఉంటే ఇంటి వద్దకే పథకాలు అందజేస్తున్నట్టు వివరించారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను గెలిపించుకుంటే మరిన్ని పథకాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, అనీల్, మనోహర్‌రెడ్డి, మునిబాబు, జీవన్, జయ, బాష, గోపి, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



శానంబట్లలో పెళ్లి కానుక అందజేస్తున్న సర్పంచ్ యశోద, డివిజన్ అధ్యక్షుడు నాగరాజు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం శానంబట్లకు చెందిన మణి, సులోచన దంపతుల కుమార్తె శశికళకు భానుప్రకాష్‌తో బుధవారం వివాహం జరగనుంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన పెళ్లి కానుకను మంగళవారం సర్పంచ్ యశోద, వైఎస్సార్ సీపీ తొండవాడ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, ఎంపీటీసీ భారతి, త్యాగరాజు అందజేశారు.



పాకాల: పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు

పాకాలలో..

పాకాల : మండలంలోని మద్దినాయనపల్లి పంచాయతీ కొత్త ఒడ్డిపల్లికి చెందిన నూతన వధూవరులు హేమలత, పురుషోత్తంకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పెళ్లి కానుక పంపించారు. వాటిని ఎంపీపీ లోకనాథం, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ గిరిధర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఈశ్వరయ్య, ఇడగట్టు జయదేవ్, తదితరులు అందజేశారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

తిరుపతి తుడా : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశించారు. ఆమె మంగళవారం ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో కలిసి ఎం.కొత్తపల్లిలోని జగనన్న ఇళ్ల లేఅవుట్‌ను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను తనిఖీచేశారు. ఆమె మాట్లాడుతూ మొదటి దశలో ప్రారంభమైన ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. నిర్మాణంలో అలసత్వం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డీఈఈలు సంజీవ్‌కుమార్, మోహన్‌రావులు పాల్గొన్నారు.

పక్కాగా వేస్ట్ మేనేజ్‌మెంట్

తూకివాకం గ్రీన్ సిటీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పక్కాగా నిర్వహించాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం తిరుపతిలో వెలువడే వివిధ వ్యర్థాల నిర్వహణ కోసం నిర్మించిన ప్లాంట్లను తనిఖీచేశారు. ప్రతి ప్లాంట్ పూర్తి స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సెగ్రిగేషన్, రీసైక్లింగ్, చెత్త నుంచి తయారుచేసే బయోగ్యాస్, సేంద్రియ ఎరువులను పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డీఈ విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



ఎం.కొత్తపల్లి లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

ముగిసిన రామానుజాచార్యుల అవతారోత్సవాలు

తిరుపతి కల్చరల్: టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో మూడు రోజులుగా చేపట్టిన రామానుజాచార్యుల అవతారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు సలహాదారు హైదరాబాద్‌కు చెందిన కేకే.పరకాలన్ రామానుజ చతుశ్లోకి అనే అంశంపై ఉపన్యసించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు జి.మధుసూదన్‌రావు బృందం ప్రదర్శించిన అన్నమయ్య సంకీర్తనల గానామృతం భక్తులకు అలరించింది. ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఏఈవో శ్రీరాములు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పురుషోత్తం పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు బుగ్గి

తిరుపతి ఎడ్యుకేషన్: మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయని పాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ మంజుల తెలిపారు. మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 విద్యార్థులు మంగళవారం తిరుపతి రూరల్ తనపల్లిలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల ఎక్కువ మంది యువకులు మద్యంతోపాటు పొగాకు, మాదకద్రవ్యాలకు బానిసలుగా మారారని తెలిపారు. తాత్కాలిక ఆనందం, తోటి వారి ప్రోద్బలం, ఆర్థిక ఒత్తిడి తదితర కార్యణాలతో మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని ఛిద్రం చేసుకుంటున్నారని వాపోయారు. వీటి బారిన పడిన వారికి డ్రగ్ డి ఆడిక్షన్ సెంటర్లలో కౌన్సెలింగ్‌తోపాటు చికిత్స అందిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని నీరజ పాల్గొన్నారు.

మలేరియాతో అప్రమత్తంగా ఉండాలి



భాకరాపేటలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

భాకరాపేట : మలేరియాతో అప్రమత్తంగా ఉండాలని భాకరాపేట వైద్యాధికారిణి శశికళ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భాకరాపేటలో ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దోమల వల్లే మలేరియా వ్యాపిస్తుందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించడం ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. చలి, జ్వరం వంటి లక్షణాలు ఉంటే ప్రారంభ దశలోనే వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీకాంతమ్మ, హెచ్ఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులో సవరణలకు అవకాశం

తిరుపతి అర్బన్ : ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల్లో తప్పుల సవరణ, వివరాల మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అవసరమైన వారు నిర్ణీత ధ్రువీకరణ పత్రాలతో ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి ఫొటో, పేర్ల మార్పుతోపాటు కొత్తవారిని జతపరచుకోవచ్చని వివరించారు.

బీసీల అభ్యున్నతికి జగనన్న కృషి

- నెలలోపు తిరుపతి బలిజ భవన్‌కు నిధులు
- కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు వెల్లడి



బలిజ భవన్ స్థలాన్ని పరిశీలిస్తున్న అడపా శేషు, బలిజ నేతలు

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభ్యున్నతికి మరింత కృషి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు తెలిపారు. ఆయన మంగళవారం తిరుపతిలోని నరసింహతీర్థం రోడ్డులోనున్న బలిజ భవన్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బలిజ భవన్ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బలిజ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. తిరుపతిలోని బలిజ భవన్‌ను సకల సౌకర్యాలతో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నెలలోపు నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. బలిజలకు ఉపయోగకరంగా కల్యాణ మండపం, ప్రత్యేక గదులు వంటి సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ, కాపు నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బలిజ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పడంపై అడపా శేషుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డెవలప్‌మెంట్ సంస్థ డైరెక్టర్ వై.సురేష్, ఆళ్వార్ మురళి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు

తిరుపతి అర్బన్: తిరుపతి మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. వాటిని తొలగించడంపై అధికారులు శ్రద్ధ చూపకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. తిరుపతి నగరం అలిపిరి రోడ్డులోని మహతి ఆడిటోరియం సమీపంలో మత్స్యశాఖ కార్యాలయం ఉంది. దీని ముందు విశాలమైన స్థలం ఉంది. ఇక్కడ పిచ్చిమొక్కలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయి. అడవిని తలపిస్తుండడంతో వాటిని ఆసరాగా చేసుకుని కొంతమంది ఆకతాయిలు అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీనికితోడు ఒక్కొక్కసారి ఎండిపోయిన మొక్కలకు నిప్పు పెడుతుండడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసి పడుతున్నాయి. పక్కనే పెట్రోల్ బంక్ ఉండడంతో స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గతేడాది మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో తీవ్ర దుమారం రేగింది. ఆ సమయంలో పిచ్చిమొక్కలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులు తెలిపినా తర్వాత మిన్నకుండిపోయారు. ఇప్పుడు మళ్లీ మొక్కలు ఏపుగా పెరిగాయి. వేసవిలో ఎండలకు పిచ్చి మొక్కలు ఎండిపోయి ఎవరైనా నిప్పు పెడితే ఏమిటి సంగతి అని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'అటానమస్' దిశగా అడుగులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తొలి ప్రయత్నంలోనే నాక్ ఏ ప్లస్ గ్రేడ్ పొందిన శ్రీగోవిందరాజ స్వామి (ఎస్‌జీఎస్) ఆర్ట్స్ కళాశాల, అదే స్ఫూర్తితో అటానమస్ సాధించే దిశగా అడుగులు వేయాలని టీటీడీ జేఈఓ సదా భార్గవి కోరారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని డిగ్రీ కళాశాలలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించడం సంతోషకరమన్నారు. నాక్ బృందం కళాశాలను సందర్శించి ఏ ప్లస్ గ్రేడ్‌ను అందించిందని వెల్లడించారు. ఇందుకు కృషి చేసిన టీటీడీ డీఈఓ, సిబ్బంది, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. శిల్పకళ, సంప్రదాయం ఉట్టిపడేలా కళాశాలలో ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశామన్నారు. పూర్వ విద్యార్థులైన డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, పీఆర్ఓ టి.రవి తదితరులు సమష్టిగా కళాశాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ డీఈఓ ఎం.భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో టీటీడీ జేఈఓ సదా భార్గవి

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ తిరుపతి

- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత
- స్వచ్ఛ సర్వేక్షన్‌పై అధికారులతో సమీక్ష

తిరుపతి తుడా: ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ తిరుపతి సాధ్యమని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత పేర్కొన్నారు. ఆమె మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్‌పై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరం ప్రముఖ యాత్రా స్థలం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారని, ఎప్పటికప్పుడు రోడ్లు, పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణపై మరింత దృష్టి సారించాలని చెప్పా రు. కొన్ని కూడళ్లలో చెత్త పారబోసే సంస్కృతి ఉండడంపై మండిపడ్డారు. ఆయా ప్రాంతాల్లో సిబ్బందిని పెట్టి స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. చెత్తను వంద శాతం సెగ్రిగేషన్ చేయాల్సిందేనన్నారు. మెయిన్ డ్రైన్లలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కట్టడికి కఠినంగా వ్యవహరించనున్నట్లు చెప్పారు. మనం.. మన ఇల్లు అన్న తరహాలో తిరుపతిని మనమే శుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే తిరుపతికి జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తోందని అన్నారు. తిరుపతి పరపతిని పెంచేందుకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలన్నారు. ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, సంజీవ్ కుమార్, గోమతి, మహేష్, నరేంద్ర, శానిటరీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ చంద్రబాబు

- ఎంపీ గోరంట్ల మాధవ్



ఎంపీ గోరంట్ల మాధవ్

తిరుమల: అవినీతికి కేరాఫ్ చంద్రబాబు నాయుడని ఎంపీ గోరంట్ల మాధవ్ ఆరోపించారు. ఆయన మంగళవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించగా అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల ఎంపీ మీడియాతో మాట్లాడుతూ సీఎంగా జగన్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. టీడీపీలో లోకేష్ ఎక్స్‌ట్రా ప్లేయర్ అని అభివర్ణించారు. లోకేష్ పాదయాత్ర చేసినా, చంద్రబాబు బస్సు యాత్ర చేసినా జగన్ జైత్రయాత్రను ఆపలేరన్నారు. అలాగే ఎంపీ ధర్మపురి అరవింద్, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జి.ఆనంద్, ఎమ్మెల్యే వాసుబాబు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

అక్షయ క్షేత్రం పరిశీలన

తిరుపతి రూరల్: దుర్గసముద్రం, రేణిగుంట అక్షయ క్షేత్రంలో ఉన్న మానసిక వికలాంగులు, ప్రత్యేక అవసరాల చిన్నారుల పునరావాస సేవా కేంద్రాలను మంగళవారం టీటీడీ జేఈవో సదాభార్గవి పరిశీలించారు. కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి పిల్లల వివరాలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ అక్షయ కేంద్రానికి టీటీడీ ఏడాదికి రూ.15 లక్షల వరకు ఆర్థిక సహాయం చేసేదన్నారు. కోవిడ్ సమయం నుంచి నిలిపేసినట్టు తెలిపారు. తిరిగి ఆర్థిక సహాయం అందించే విషయంపై నివేదిక ఇవ్వాలని ఈవో ధర్మారెడ్డి ఆదేశించారని, ఈ క్రమంలోనే కేంద్రాలను సందర్శించినట్లు చెప్పారు. త్వరలోనే నివేదిక ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈవో భాస్కర రెడ్డి, పీఆర్వో రవి, బాల మందిరం ఏఈవో అమ్ములు పాల్గొన్నారు.

పేదల భూమి సమస్య పరిష్కారమెన్నడో..?

తిరుపతి రూరల్/తిరుపతి కల్చరల్: స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయినా పేదల భూమి సమస్య పరిష్కారం కాలేదని గ్రామీణ పేదల సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జతిన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలోని యూత్ హాస్టల్లో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర మహాసభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు దాసోహమై లక్షలాది ఎకరాలను దోచి పెడుతున్నాయని ఆరోపించారు. చిన్న గుడిసె వేసుకోవడానికి కూడా భూమి ఇవ్వలేని దుస్థితి దేశంలో ఉండడం దౌర్భాగ్యమన్నారు. పేదలంతా సంఘటితమై పోరాడడమొక్కటే పరిష్కారమన్నారు. కర్ణాటకకు చెందిన రచయిత, న్యాయవాది రవీంద్రధనవంత్ మాట్లాడుతూ రాజకీయాల్లో మతోన్మాదం పెరుగుతోందని, ఇది దేశ సార్వభౌమధికారానికి చేటు తెస్తుందని హెచ్చరించారు. సీనియర్ జర్నలిస్ట్ రాఘవశర్మ మాట్లాడుతూ గ్రామీణ పేదల్లాగానే పట్టణ పేదలు కూడా తమ సమస్యల పరిష్కారం కోసం ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. సాయంత్రం యూత్ హాస్టల్ నుంచి ఎయిర్ బైపాస్ రోడ్డు మీదుగా లక్ష్మీపురం సర్కిల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సభల్లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్నాయక్, జయరామ్, వెంకటేశ్వరవు, ముత్తయ్య, మోహన్‌రెడ్డి, సత్యనారాయణ, మూర్తి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పాకాల : రెవెన్యూకి సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం దామలచెరువు పంచాయతీ బందార్లపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉన్నా తెలపాలన్నారు.



రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ భాగ్యలక్ష్మి

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన వేలాయుధం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం రంగంపేటలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. తిరుపతి రూరల్ మండలం ఓటేరుకు చెందిన వేలాయుధం సోమవారం బైక్‌లో భాకరాపేట నుంచి తిరుపతికి వస్తున్నాడు. అదే సమయంలో మంగళంపేట గడ్డంవారిపల్లికి చెందిన మోహన్ రెడ్డి తిరుపతికి బయలుదేరాడు. వేలాయుధం రంగంపేట సమీపంలోని బ్రాందీ షాప్ వైపునకు బైక్ తిప్పగా వెనక వస్తున్న మోహన్ రెడ్డి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ పోలీసులు రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ మోహన్(36) సోమవారం మృతి చెందాడు. వేలాయుధం మంగళవారం మృతి చెందారు. మృతదేహాలను బంధువులకు అప్పగించారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.